## క్లుప్తంగా

### నెట్టికంటుడి సన్నిధిలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్



స్వామివారిని దర్శించుకుంటున్న రాకేష్

**గుంతకల్లు రూరల్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ బుధవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### గరుగుచింతలపల్లి చెరువుకు నీటి విడుదల



కోమటికుంట్ల చెరువు వద్ద జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

**పుట్లూరు:** కోమటికుంట్ల చెరువు నుంచి గరుగు చింతలపల్లి చెరువుకు బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కోమటికుంట్ల చెరువు వద్ద ఆమె జలహారతి ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటి రైతులు ఇబ్బందులు పడకుండా ఇచ్చిన హామీ మేరకు మూడు చెరువులకు నీటిని సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**యల్లనూరు:** మండల కేంద్రంలో రూ.53 లక్షలతో తలపెట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం నాయకులతో మండల కేంద్రంలోని కాలనీల సమస్యలపై చర్చించారు.

### గాలిమరల సెక్యూరిటీ సిబ్బంది నిరసన

**పుట్లూరు:** ఎల్లుట్ల సమీపంలో కొండలపై గాలి మరల వద్ద విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది తమ జీతాల్లో కోత విధించడంపై బుధవారం నిరసన తెలిపారు. నిరుద్యోగులైన తాము గాలిమరల వద్ద ఓ ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ వద్ద సిబ్బందిగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ఇలాంటి సమయంలో తమకు వచ్చే జీతంలో రూ.2500 యునిఫాం కోసం కోత విధించడం సమంజసం కాదన్నారు. అలాగే కార్మిక చట్టం ప్రకారం తమకు పీఎఫ్ జమ చేయలేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

### పంటకోత ప్రయోగాలు



పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏడీఓ చెంగలరాయుడు

**పుట్లూరు:** మండలంలో బుధవారం చేపట్టిన జొన్న పంట కోత ప్రయోగాలను తాడిపత్రి డివిజన్ ఏడీఏ చెంగలరాయుడు పరిశీలించారు. చింతకుంట గ్రామంలోని జొన్నపొలంలో ఐదు మీటర్ల పొడవు, వెడల్పులో పంటకోత ప్రయోగం నిర్వహించగా 2.40 కిలోల దిగుబడి, శనగలగూడూరు గ్రామంలో మినుము పంట కోత ప్రయోగం చేపట్టగా 2.750 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హరి, ఎంపీఈఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

### అండర్ బ్రిడ్జితో తప్పని అవస్థలు



బ్రిడ్జి కింద నీళ్లు నిల్వ ఉండటంతో ద్విచక్రవాహనం నిలిచిపోయిన దృశ్యం

**గుత్తి:** పట్టణ శివారులోని ఫోర్టు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద వర్షపు నీరు పెద్ద ఎత్తున నిల్వ ఉండటంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఈ దారి గుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బ్రిడ్జి వద్ద మడుగును తలపించేలా నీళ్లు ఉండటంతో వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్లోతు కంటే పైగా నీళ్లు నిలువ ఉండటంతో ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఓ ద్విచక్ర వాహనం నీటిలో నిలిచిపోయింది. రైల్వే అధికారులు స్పందించి బ్రిడ్జి కింద ఉన్న నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### 12న మహిళా కబడ్డీ పోటీలు

**తాడిపత్రి అర్బన్:** ఈనెల 12న ఏపీ మోడల్ పాఠశాల సమీపంలోని సౌభాగ్య సింధు ట్రస్ట్, బాల కళ్యాణ ఆశ్రమంలో అండర్-19 మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 7330625055, 8919278039 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# మల్చింగ్‌పై మక్కువ!



- ఒకే ఖర్చుతో రెండు పంటలు
- తెగుళ్ల బెడద, నీటి వృథా నివారణ
- రాయితీ కల్పిస్తున్న ప్రభుత్వం

**యాడికి:** జిల్లాలో రైతులు మల్చింగ్ విధానంపై మక్కువ చూపుతున్నారు. ఇప్పటి వరకు కర్ణాటకకు పరిమితమైన ఈ పద్ధతి జిల్లాలో ఊపందుకుంది. ప్రధానంగా కూరగాయలు, పండ్లతోటల రైతులు ఈ పద్ధతిపై ఆసక్తి చూపుతున్నారు. చీడపీడల నివారణతోపాటు నీటి వృథా అరికట్టడం అన్నదాతలకు కలసివస్తోంది. తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి 80 ఎకరాలు, పెద్దవడుగూరు 10, పెద్దపప్పూరు 25 ఎకరాల్లో మల్చింగ్ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. కూరగాయ పంటలైన టమాట, బీన్స్, వంగ, కళింగర, కర్బూజ, దోస తోటలతోపాటు పూల సాగుకు 50 నుంచి వంద మైక్రాన్ల ప్లాస్టిక్ పేపరును మల్చింగ్‌గా వేసుకోవచ్చు. అరటి, బొప్పాయి, తదితర పంటలకు వంద కంటే ఎక్కువ మైక్రాన్ల పేపర్‌ను ఉపయోగించవచ్చు. దుక్కి దున్నుకున్నాక బోదెలు సిద్ధం చేసుకొని ప్లాస్టిక్ పేపరు వేసి మట్టిని కప్పుకోవాలి. ఆపై కావాల్సిన చోట రంధ్రాలు చేసి అందులో విత్తనాలు, లేదా మొలక వేసుకోవచ్చు. హెక్టార్ పొలానికి 600 మీటర్ల పొడవైన మల్చింగ్ షీట్ కావాలి. ఇందుకు మీటర్‌కు రూ.53 చొప్పున రూ.32 వేల దాకా ఖర్చవుతుంది. ఇందులో ఉద్యాన శాఖ 50 శాతం చొప్పున రాయితీ ఇస్తోంది.

**లాభాలెన్నో..**

ఎకరా పంటకు వినియోగించే నీటితోనే మూడెకరాలు సాగు చేసుకోవచ్చు. సాధ్యమైనంత వరకు కలుపును నివారించుకోవచ్చు. కూలీల ఖర్చులు తగ్గుతాయి. తెగుళ్లు, చీడ పీడల సమస్యలు తక్కువ. వారినికోసారి నీటి తడులు సరిపోతాయి. 90 శాతం పంట దిగుబడి పెరుగుతుంది. పంట కాలాన్ని 40 శాతం వరకు పొడిగించుకోవచ్చు. భూమిలో తేమ చాలా కాలం ఉంటుంది. అదే భూమిలో రెండో పంట సాగు చేసుకోవచ్చు. కూలీలు, పురుగు మందుల పిచికారీ తగ్గడంతో ఎకరానికి రూ.20 వేల వరకు ఆదా అవుతుంది. మల్చింగ్ విధానంలో మొక్క చుట్టూ తేమ ఆవిరి కాదు. పొలంలో వర్షం కురిసినపుడు మల్చింగ్ షీట్ కారణంగా నేరుగా భూమిపై పడకపోవడంతో మట్టి కోతకు గురికాకుండా ఉంటుంది. పంటల భూసారం పరిరక్షించబడుతుంది.

#### మల్చింగ్ పద్ధతే మేలు



కర్ణాటకలో మల్చింగ్ విధానంలో సాగు చేయడం చూశా. మూడేళ్లుగా పలు రకాల పంటలను మల్చింగ్‌తోనే సాగు చేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. కలుపు సమస్య తగ్గడంతో కూలీల ఖర్చు మిగిలింది. ఈ విధానం రైతులకు చాలా మేలు.

–కోనా వెంకటశివారెడ్డి, కోనుప్పలపాడు, యాడికి మండలం

#### 3 ఎకరాల్లో సాగు చేస్తున్నా



నేను 3 ఎకరాల్లో కళింగర సాగు చేస్తున్నా. బిందు సేద్యం, మల్చింగ్ పద్ధతుల ద్వారా సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయి. ఉద్యాన పంటలు మల్చింగ్ విధానంలో సాగు చేస్తేనే రైతుకు లాభసాటిగా ఉంటుంది.

–రఘునాథ రెడ్డి, లక్షుంపల్లి, యాడికి మండలం

#### సబ్సిడీ ఇస్తున్నాం



మల్చింగ్ విధానంలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు సబ్సిడీ ఇస్తున్నాం. ఎకరాకు రూ.6,400 అందజేస్తున్నాం. కూరగాయలు, కలింగర తదితర పంటలకు మాత్రమే సబ్సిడీ ఉంది. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలి.

– ఉమాదేవి, తాడిపత్రి ఉద్యాన శాఖ అధికారిణి

## ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న విద్యాశాఖ డైరెక్టర్ నారాయణ భరత్‌గుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య

**గుంతకల్లుటౌన్:** శ్రీకన్యకాపరమేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిగ్రీ ఫస్టియర్ పరీక్షా ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్త విడుదల చేశారు. కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా దక్కిన తరువాత మొదటిసారి నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ఫలితాలను మంగళవారం విజయవాడలో విడుదలయ్యాయి. బుధవారం స్థానిక కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ లక్ష్మయ్య ప్రకటించారు. కళాశాలలో 304 మంది విద్యార్థులు డిగ్రీ ఫస్టియర్ పరీక్షలు రాయగా అందులో 183 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 2023లో కళాశాలకు నాక్ ఏ-గ్రేడ్, 2024లో అటానమస్ హోదా పొందడం చాలా గర్వంగా ఉందన్నారు. అధ్యాపకుల కృషిని, విద్యార్థుల ప్రతిభను ఆయన కొనియాడారు. కాగా పరీక్షా ఫలితాలు కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, రీవాల్యూయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ ఆర్.నాగరాజు తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.300 చెల్లించాలన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ ఓబులేసు, హెచ్‌ఓడీలు డాక్టర్ జనార్దన్ శాస్త్రి, డాక్టర్ గోపినాయక్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జమీలబీబీ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



కళాశాల ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

**తాడిపత్రి రూరల్:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. కళాశాల ప్రాంగణలో విద్యార్థినులు పోటాపోటీగా ముగ్గులు వేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో..**

తాడిపత్రి మండలం తలారి చెరువు వద్ద గల అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీ జరిగింది. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు మారువకూడదన్న లక్ష్యంతో ఏటా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలను ఉట్టిపడేలా మహిళలు రంగవల్లులు వేశారన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ప్లాంట్ చీఫ్ మేనేజర్ కృష్ణయ్య హాజరయ్యారు.

### ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

**గార్లదిన్నె:** దివ్యాంగుల విద్యార్థులు ఫిజియోథెరపీ చేయించుకుంటే అంగవైకల్యం దూరమవుతుందని ఎంఈఓ-2 వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు. బుధవారం గార్ల దిన్నెలో పీడబ్ల్యూ కాలనీలో భవిత కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా భవిత కేంద్రంలో దివ్యాంగుల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి బుధవారం భవిత కేంద్రంలో ఆర్థో, న్యూరో వైకల్యం గల పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ చేస్తారన్నారు. భవిత కేంద్రంలో 55 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉండగా వారికి ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా రూ.1.66 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు రూ.3 వేలు, వారిని తీసుకువచ్చే అటెండర్స్‌కు రూ.3 వేలు ఇస్తారన్నారు. దివ్యాంగుల విద్యార్థుల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**బీజేపీ మండలాధ్యక్షుడిగా అంజినాయక్**

**పామిడి:** బీజేపీ మండలాధ్యక్షుడిగా చౌహాన్ అంజినాయక్‌ను రెండోసారి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం ఎంపిక చేశారు. తన ఎంపికకు సహకరించిన పార్టీ పెద్దలకు చౌహాన్ అంజినాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

### సంక్షిప్త సమాచారం

**తప్పిన పెను ప్రమాదం**

**శింగనమల:** స్థానిక చిన్న కాలువ వీధిలో బుధవారం విద్యుత్ స్తంభం విరిగిన పడిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. పంచాయతీ సిబ్బంది వీధి దీపం ఏర్పాటు చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కారు. ఇంతో స్తంభం ఒక వైపునకు ఒరిగి పక్కనున్న మిద్దె మీదకు పడిపోయింది. ఈక్రమంలో విద్యుత్ తీగలు నాలుగు స్తంభాల వరకూ తెగి కిందపడిపోయాయి. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపేయడంతో ప్రమాదం తప్పింది.

**ధాన్యం ప్యాకెట్ల అపహరణ**

**యాడికి:** మండల కేంద్రంలో కమలపాడు రహదారిలో ఉన్న ప్రైవేట్ గోడంగిలో మంగళవారం రాత్రి ధాన్యం ప్యాకెట్ల చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని లాలెప్ప కాలనీకి చెందిన ప్రసాద్ కొంతకాలంగా జొన్నలు, కొర్రలు, సద్దలు రైతులతో కొనుగోలు చేస్తూ వ్యాపారం చేసేవాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోడౌన్ తాళం పగులగొట్టి 5 ప్యాకెట్ల జొన్నలు, 3 ప్యాకెట్ల సద్దలు, 2 ప్యాకెట్ల కొర్రలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఏఎస్‌ఐ వెంకటేష్ ఘటనస్థలాన్ని పరిశీలించారు.

## పొలాల రస్తా కొనసాగించాలి



ప్రహరీ పనులు పరిశీలిస్తున్న రైతులు, సర్వే ఏడీ రూప్లానాయక్

**గార్లదిన్నె:** మండల కేంద్రం సమీపంలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థ(ట్రాక్టర్‌నగర్) నుంచి లోలూరు, రఘునాథపురం గ్రామాలకు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రస్తాను కొనసాగించాలని రైతులు, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు జిల్లా సర్వే ఏడీ రూప్లానాయక్‌తో కలిసి ట్రాక్టర్‌నగర్ అధికారులు చేపడుతున్న ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ట్రాక్టర్ నగర్ సంస్థ దాదాపు 450 ఎకరాల్లో నిర్వహిస్తున్నారన్నారు. గతంలో ట్రాక్టర్‌నగర్ అధికారులు భూముల చుట్టూ 15 అడుగులు భూమి వదిలి, కంచె ఏర్పాటు చేసుకున్నారన్నారు.అయితే ప్రస్తుత డైరెక్టర్ బాలాజీ మురారి నాందెడే ట్రాక్టర్ నగర్ భూములు చుట్టూ ఉన్న కంచె తొలగించి ప్రహరీ నిర్మిస్తున్నారన్నారు. అలాగే దారి కోసం వదిలిన 15 అడుగుల్లో కేవలం 12 అడుగులు వదిలి ప్రహరీ నిర్మిస్తున్నారన్నారు. 12 అడుగుల దారిలో ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు పోవడానికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. దారి సమస్యపై శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇందులో భాగంగా జిల్లా సర్వే ఏడీ రూప్లానాయక్ క్షేత్ర స్థాయిలో దారిని పరిశీలించారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చెన్నారెడ్డి, రైతులు రామ్మోహన్, హనుమంతరెడ్డి, లక్ష్మీనారాయణ, ఓమ్‌నాథ్‌రెడ్డి, గిరిరెడ్డి పాల్గొన్నారు.

## నైపుణ్యం పెంపొందించుకోండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని

**గుంతకల్లుటౌన్:** చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారు సాంకేతిత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మెప్మా ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్లకు నైపుణ్యం మెరుగుపరచడంలో భాగంగా సాంకేతితతో కూడిన శిక్షణ కల్పించేందుకు ఫేస్-1 కింద రిజిస్ట్రేషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్ ప్రొవైడర్‌లైన ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, టీవీ, ఏసీ, గీజర్ మెకానిక్‌లు, బ్యూటీషియన్ తదితర చేతివృత్తుల వారు తమ పేర్లను మెప్మా విభాగంలో నమోదు చేసుకోవాలన్నారు. వీరందరికీ ఉచిత శిక్షణతో పాటు ఉపాధిని కల్పిస్తామన్నారు. ఇదిలా ఉండగా 125 మంది సర్వీస్ ప్రొవైడర్లు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా టీపీఆర్ఓ మోహన్, మేనేజర్ రాధా, టీఎంసీ కెరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



ఇంటిపట్టాను అందిస్తున్న ఎమ్మెల్యే జేసి అస్మిత్‌రెడ్డి

**పెద్దపప్పూరు:** రెవెన్యూ సదస్సుల సందర్భంగా ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జేసి అస్మిత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చిన్నయక్కలూరు, చెర్లోపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు హాజరై మాట్లాడారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాజీరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**గుత్తి రూరల్:** ఊటకల్లు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రత్యేక అధికారిణి కల్యాణి, తహసీల్దార్ ఓబులేసు, డీటీ శ్రీలతలు రైతులతో వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులలో సమస్యలు ఉన్న రైతులు అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఆరుగురు రైతులు సమస్యలపై అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. సర్పంచ్ లహరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అలవాల సూర్యనారాయణరెడ్డి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలు వాడొద్దు

**గుత్తి:** విద్యార్థులు ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రామసుబ్బయ్య సూచించారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మత్తు పదార్థాలు సేవించడం వల్ల, ర్యాగింగ్ చేయడం వల్ల కలిగే అనర్థాలు, నష్టాలను విద్యార్థులకు వివరించారు. అంతే కాకుండా వాటి జోలికి వెళితే చట్టంలో ఉన్న శిక్షలను వివరించారు. విద్యార్థులు సమాజంలో చాలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, హెచ్‌ఓడీ హరిప్రియ, ప్రొఫెసర్ నరసింహులు, అనంత గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### అధికారి తీరుతో ఉద్యోగులకు ఇబ్బందులు

**పుట్లూరు:** ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ అధికారి నోటి దురుసు కారణంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని తరచూ ఇష్టానుషారంగా మాట్లాడటంపై ఇప్పటికే పలువురు ఉద్యోగులు మండలస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం సదరు అధికారి అవినీతి ఆరోపణలు ఓ పత్రికలో ప్రచురణ కావడంపై సహనం కోల్పోయి తనను ఏమి చేయలేరంటూ అసభ్య పదజాలంతో చిందులు తొక్కినట్లు తెలిసింది.

### 'హెచ్‌ఎంపీవీ'పై అప్రమత్తంగా ఉండండి



వైరస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు కీర్తన

**యల్లనూరు:** హ్యూమన్ మెటా న్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ)పై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తిమ్మంపల్లి వైద్యురాలు కీర్తన సూచించారు. బుధవారం స్థానిక ఆస్పత్రిలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వైరస్ కరోనా వైరస్‌లాగా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై ప్రభావం ఎక్కువ ఉంటుందన్నారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణమ్మ, పీహెచ్‌ఎన్ దీనకుమారి పాల్గొన్నారు.

### మద్యానికి డబ్బివ్వలేదని ఆత్మహత్యాయత్నం

**తాడిపత్రిటౌన్:** మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. పట్టణంలోని క్రిష్ణాపురం 10 రోడ్డులో నివాసం ఉంటున్న మహబూబ్‌భాషా మద్యానికి బానిసై మతిస్థిమితం లేని వాడిలా ప్రవర్తిస్తుంటాడు. ఈక్రమంలో బుధవారం కుటుంబ సభ్యులు మద్యానికి డబ్బు ఇవ్వలేదని బాత్‌రూంలో ఉన్న యాసిడ్ తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### చింతల ఆలయంలో కోయిల్ అళ్వార్ తిరుమంజనం



ఆలయాన్ని ప్రోక్షణ చేస్తున్న అర్చకులు

**తాడిపత్రి అర్బన్:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం చింతల వెంకటరమణస్వామి ఆలయంలో కోయిల్ అళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏటా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో కోయిల్ అళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయంలోని ప్రధాన ద్వారం, ఆలయం వెలుపల, ప్రాంగణంలో పవిత్రమైన పరిమళ ప్రోక్షణ చేశారు. ఆలయంలోని పూజా సామగ్రి తదితర వస్తువులను శుభ్రం చేశారు. స్వామి మూలవిరాట్‌ను వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలంతో ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తర్వాత స్వామి వారి మూలవిరాట్‌కు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ నిర్వహించారు.

### జగనన్నను కలిసిన మిద్దె కుళ్లాయప్ప



**నార్పల:** మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మిద్దె కుళ్లాయప్ప తాడేపల్లిలో బుధవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

**గుత్తి:** మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లమ్మ గుడి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఏసీడీపీఓ నాగమణి ఆస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో లబ్ధిదారులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరుగుతున్నదా లేదా అనే విషయంపై ఆరా తీశారు. సమయ పాలన పాటించాలని కార్యకర్త, ఆయాను ఆదేశించారు.

### 14న కల్లూరులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

**గార్లదిన్నె:** పాత కల్లూరు గ్రామంలో ఈనెల 14న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా యువకులకు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే టీములు 13తేదీ లోపు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.8 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు, నాలుగో బహుమతి రూ.1000 నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7981646683, 6302655150 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లను అందిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం రమేష్ బాబు

**యాడికి:** రాయలచెరువు స్టేట్ బ్యాంకు వారు అందిస్తున్న సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలని వేములపాడు ఎంపీయూపీ హెచ్‌ఎం గాయత్రి అన్నారు. బుధవారం వేములపాడు ప్రాథమి కోన్నత పాఠశాలలో చదువుతున్న 10 మంది బాలికలకు రాయలచెరువు స్టేట్ బాంకు రీజనల్ మేనేజర్ రమేష్ బాబు తన సిబ్బందితో కలిసి సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ శ్రీకృష్ణ, రాయలచెరువు బ్యాంచ్ మేనేజర్ సూర్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### వెంకటరెడ్డిపల్లిలో తనిఖీలు

**తాడిపత్రి రూరల్:** వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పరిసర ప్రాంతాల్లో బుధవారం అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. పోలీసుల వస్తున్నట్లు సమాచారం అందుకున్న జూదరులు అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. రోడ్డుపై ఉన్న ద్విచక్ర వాహనాలు జూదరులవన్న అనుమానంతో వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

### డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

**గుంతకల్లు:** స్థానిక శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల (అటానమస్) ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలను శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు బుధవారం విడుదల చేశారు. కళాశాల చైర్మన్ డీపీ మురళీకృష్ణ, డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. మొత్తం 425 మంది విద్యార్థులు హాజరుకాగా, అందులో 338 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు(78.56 శాతం) ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బయోటెక్నాలజీ విద్యార్థి గురజాల పావని 9.09 శాతంతో కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. అనంతరం కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.